www.prajasakti.com
ప్రజాశక్తి
శుక్రవారం 17 జనవరి 2025
5
ఏలూరు

22న పలు కార్యక్రమాలకు టెండర్

ఆలయ కార్య నిర్వహణ అధికారి సీతారామయ్య

ప్రజాశక్తి - ముసునూరు

బలివే గ్రామంలో వేంచేసియున్న శ్రీరామలింగేశ్వర స్వామి కళ్యాణ ఉత్సవాలు, వచ్చే నెల 25వ తేదీ నుంచి 28వ తేదీ వరకు జరగనున్న మహాశివరాత్రి ఉత్సవాల వేడుకల్లో పలు కార్యక్రమాలకు టెండర్ విధానాన్ని ఈనెల 22వ తేదీన నిర్వహించబడునని ఆలయ కార్య నిర్వహణ అధికారి పామర్తి సీతారామయ్య పేర్కొన్నారు. గురువారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ నేటి నుంచి ఈనెల 21వ తేదీ వరకు బలివే గ్రామంలో వేంచేసిన శ్రీరామలింగేశ్వర స్వామి కళ్యాణ ఉత్సవాలు సందర్భంగా షామియానా, భోజన వసతి ఏర్పాట్లు, క్యూలైన్లు ఏర్పాట్లు, పలు అభివృద్ధి కార్యక్రమాలకు టెండర్ ప్రకటన ఈనెల 22వ తేదీన ఆలయం వద్ద ఉదయం 11 గంటల నుంచి నిర్వహించబడునన్నారు. ఆసక్తి ఉన్న వ్యక్తులు టెండర్ రుసుము రూ.200 నగదు జమ చేసి టెండర్‌లో పాల్గొనవలసిందిగా తెలియజేశారు.

ప్రతి నియోజకవర్గంలోనూ..

ఇండస్ట్రియల్ పార్కులు..!

జిల్లాలో 1500 ఎకరాల ప్రభుత్వ భూమి గుర్తింపు

కొల్లేరులో 14 వేల ఎకరాల జిరాయితీ భూములు, ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

జనవరి నెలాఖరుకు రోడ్లపై గుంతలు పూడ్చుతాం

పోలవరం నిర్వాసితుల సమస్యలపై ప్రత్యేక గ్రామసభలు

ఏలూరు సర్వజన ఆసుపత్రి సమస్యలపై ప్రత్యేక కార్యాచరణ

డిఆర్‌సి సమావేశంలో ఇన్‌ఛార్జి మంత్రి నాదెండ్ల మనోహర్

డిఆర్‌సి సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌ఛార్జి మంత్రి నాదెండ్ల మనోహర్

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

జిల్లాలో వ్యవసాయంతోపాటు పారిశ్రామిక అభివృద్ధికి ప్రతి నియోజకవర్గంలోనూ ఇండస్ట్రియల్ పార్కులు ఏర్పాటు చేసేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నామని, మార్చి 15కల్లా ఇండస్ట్రియల్ పార్కుల ఏర్పాటుకు సంబంధించి పనులు చేపడతామని, దీనికి నోడల్ వ్యవస్థను ఏర్పాటు చేస్తామని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. గురువారం స్థానిక కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో మనోహర్ అధ్యక్షతన డిఆర్‌సి (జిల్లా సమీక్షా కమిటీ) సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సమాచారశాఖ మంత్రి కొలుసు పార్థసారధి, ఎంపీ పుట్టా మహేష్‌కుమార్, జెడ్‌పి ఛైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ, పలువురు ఎంఎల్‌ఎలు, జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి, జెసి ధాత్రిరెడ్డి, ఎస్‌పి కె.ప్రతాప్‌శివకిషోర్, జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఉదయం 11.30 గంటలకు ప్రారంభమైన సమావేశం మధ్యాహ్నం 2.30 గంటల వరకూ సాగింది. జిల్లాలోని ప్రధానమైన అంశాలపై చర్చ సాగింది. సమావేశం అనంతరం వివరాలను ఇన్‌ఛార్జి మంత్రి మనోహర్ మీడియాకు వివరించారు. తొలుత పోలవరం ఆర్‌అండ్‌ఆర్ అమలు, కాలనీల్లో సమస్యలపై చర్చించారు. పోలవరం, కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో 41.15 పరిధిలో ఎన్ని గ్రామాలు ఖాళీ చేయిస్తున్నారు, ఎన్ని నిర్వాసిత కుటుంబాలకు పరిహారం జమైంది, నిర్వాసిత కాలనీల్లో ఇళ్ల నిర్మాణం, మౌలిక సదుపాయాలపై చర్చించారు. ఈ సందర్భంగా పోలవరం ఎంఎల్‌ఎ చిర్రి బాలరాజు మాట్లాడుతూ స్ట్రక్చర్ వాల్యూపై సమస్యలు ఉన్నాయన్నారు. గ్రామసభలు నిర్వహించి నిర్వాసితుల సమస్యలను తెలుసుకుంటే బాగుంటుందన్నారు. 2017 తర్వాత 18 ఏళ్లు నిండిన యువతకు పరిహారం అందలేదన్నారు. ఇళ్ల నిర్మాణంలో సమస్యలు ఉన్నాయని, కాలనీల్లో మౌలిక సదుపాయాలు సరిగా లేవని అన్నారు. దీనిపై ఇన్‌ఛార్జి మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ అంతా కలిసి ఒకసారి మండలస్థాయిలో గ్రామసభలు నిర్వహిద్దామని, అందుకు సంబంధించిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను ఆదేశించారు. జిల్లాలో పారిశ్రామిక అభివృద్ధిపై జరిగిన చర్చలో మంత్రి కొలుసు పార్థసారధి, ఎంపీ పుట్టా మహేష్‌కుమార్, ఎంఎల్‌ఎ చింతమనేని ప్రభాకర్ మాట్లాడారు. వట్లూరులోని పెద చెరువుకు సంబంధించిన 350 ఎకరాల భూములపై చర్చ సాగింది. దీనిపై పూర్తి నివేదిక ఇవ్వాలని ఇన్‌ఛార్జి మంత్రి అధికారులను ఆదేశించారు. ప్రతి నియోజకవర్గంలో ఇండస్ట్రియల్ పార్కులు ఏర్పాటు చేసేలా ప్రణాళికతో ముందుకు సాగాలన్నారు. ల్యాండ్ బ్యాంక్‌లో భాగంగా 1500 ఎకరాల ప్రభుత్వ భూమి గుర్తించడంతో తొలి అడుగు పడిందన్నారు. ప్రభుత్వ భూమి పక్కాగా ల్యాండ్ పూలింగ్ ద్వారా సేకరిస్తే పరిశ్రమలు ఏర్పాటు చేయవచ్చునని ఇన్‌ఛార్జి మంత్రి దృష్టికి చింతమనేని ప్రభాకర్ తీసుకెళ్లారు.

కొల్లేరులో 14,250 ఎకరాల జిరాయితీ భూముల పరిస్థితి ఏమిటి?

కొల్లేరుపై చర్చలో ఎంఎల్‌ఎలు కామినేని శ్రీనివాస్, చింతమనేని ప్రభాకర్, పత్సమట్ల ధర్మరాజు, ఎంఎల్‌సి జయమంగళ వెంకటరమణ అక్కడి సమస్యలపై మాట్లాడారు. ఐదో కాంటూరు పరిధిలో 77 వేల ఎకరాల ఉండాల్సి ఉండగా అటవీశాఖ అధికారులు దాదాపు 90 వేల ఎకరాల్లో చెరువులను అప్పట్లో ధ్వంసం చేశారన్నారు. వీటిలో 14,250 ఎకరాలు జిరాయితీ భూములు, 5,600 ఎకరాలు డి ఫారం పట్టా భూములు ఉన్నాయన్నారు. సుప్రీంకోర్టు, పలు కమిటీలు చెప్పినప్పటికీ ఇప్పటికీ రైతుల జిరాయితీ భూములను అప్పగించలేదన్నారు. జిరాయితీ భూములను అప్పగించడంతోపాటు ప్రస్తుతం జరుగుతున్న చెరువుల ధ్వంసం చర్యలను ఆపాలని కోరారు. అక్కడి గ్రామాలకు రోడ్లు వేయకుండా ఫారెస్ట్ అధికారులు అడ్డుపడటంపై అంతా ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్కడి ప్రజలను ఇబ్బందులు పెడుతున్న అధికారులు గత ప్రభుత్వ హయాంలో అక్రమంగా వందల ఎకరాల్లో చెరువులు తవ్వినా పట్టించుకోలేదన్నారు. అందులో సూత్ర, పాత్రధారులను తేల్చాల్సి ఉందన్నారు. దీనిపై పూర్తి నివేదిక ఇవ్వాలని అక్కడి ప్రజలకు రోడ్ల సమస్య లేకుండా చూడాలని అధికారులను ఇన్‌ఛార్జి మంత్రి మనోహర్ ఆదేశించారు. దీనిపై సిఎం, డిప్యూటీ సిఎం సమక్షంలో ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడదామన్నారు. ఆర్‌అండ్‌బి రోడ్ల పనులపై అధికారులను ప్రజాప్రతినిధులు నిలదీశారు. బ్రిడ్జిలు వంటివి తప్ప మిగిలిన గుంతల పూడ్చివేత ఈ నెలాఖరుకు పూర్తి చేస్తామని అధికారులు తెలిపారు. బుట్టాయిగూడెం మండలం పట్టిన్నపాలెంలో 50 శాతం బ్రిడ్జినిర్మాణాన్ని పెండింగ్ బిల్లులు చెల్లించి పూర్తి చేస్తామన్నారు. నారాయణపురం వద్ద వంతెనపై వెంటనే ఏదోకటి తేల్చాలని అధికారులకు సూచించారు. పంచాయతీరాజ్ పరిధిలోని రోడ్లపైనా చర్చ సాగింది. ధాన్యం కొనుగోలులో ఏలూరు జిల్లా అధికారులు బాగా పని చేశారని, పౌరసరఫరాల శాఖ మంత్రిగా మీకు అభినందనలు అంటూ ప్రజాప్రతినిధులు ఇన్‌ఛార్జి మంత్రి నాదెండ్ల మనోహర్‌పై ప్రశంసల జల్లు కురిపించారు. ఏలూరు కార్పొరేషన్ పరిధిలో తన నియోజకవర్గానికి చెందిన ప్రజలు రెండు వేల మంది ఉన్నప్పటికీ కార్పొరేషన్ సమావేశాలకు తనకు ఆహ్వానం అందడం లేదంటూ దెందులూరు ఎంఎల్‌ఎ చింతమనేని ప్రభాకర్ తెలిపారు. దీనిపై కమిషనర్ నిబంధనలు వర్తించవంటూ మాట్లాడంపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. చింతమనేనిని సైతం పిలవాలని ఇన్‌ఛార్జి మంత్రి తెలిపారు. ఆర్‌డబ్ల్యుఎస్ పరిధిలోని జలజీవన్ మిషన్, ఇతర అంశాలపైనా చర్చ సాగింది. అధికారుల తీరును ప్రజాప్రతినిధులు, ఇన్‌ఛార్జి మంత్రి తప్పుబట్టారు. ప్రజల సమస్యలను తేల్చగా తీసుకోవద్దన్నారు.

ఏలూరు సర్వజన ఆసుపత్రిపై ప్రత్యేక సమావేశం ఏర్పాటుకు నిర్ణయం

డిఆర్‌సి సమావేశానికి ముందు మంత్రి మనోహర్ ఏలూరు సర్వజన ఆసుపత్రిలో ఆకస్మిక తనిఖీలు చేశారు. డిఆర్‌సి సమావేశంలో మెడికల్ సమస్యలపై ఎజెండా వచ్చినప్పుడు తనకు ఆసుపత్రిలో ఎదురైన అనుభవాలను ఇన్‌ఛార్జి మంత్రి వివరించారు. వైద్యుల కొరత నుంచి, స్కానింగ్, మెడికల్ కాలేజీ, రోగుల సమస్యలు చాలా ఉన్నాయని, దీనిపై ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసుకుని అంతా చర్చిద్దామన్నారు. ఆసుపత్రికి పూర్వ వైభవం తెస్తామన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లోని సమస్యలపై ప్రత్యేక దృష్టి సారిస్తామని తెలిపారు.

రహదారి భద్రత ప్రతిఒక్కరి బాధ్యత

కలెక్టర్ కె.వెట్రిసెల్వి

ప్రజాశక్తి - ఏలూరు

ప్రతిఒక్కరూ రహదారి భద్రతా నియమాలు పాటిస్తే రోడ్డు ప్రమాదాల నివారణ సాధ్యమని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి అన్నారు. గురువారం స్థానిక కలెక్టరేట్‌లోని కలెక్టర్ ఛాంబర్‌లో 'జాతీయ రహదారుల భద్రత మాసోత్సవాలు-2025' వాల్‌పోస్టర్లను కలెక్టర్ వెట్రిసెల్వి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రహదారి ప్రమాదాలను నివారించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మున్సిపాల్టీ, ఆర్‌అండ్‌బి, పోలీస్, పంచాయతీరాజ్, ఎన్‌హెచ్ తదితర శాఖలు కూడా భాగస్వామ్యం చేయాలన్నారు. మానవ తప్పిదాల వల్లే 75 శాతం రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. పరిమితికి మించి వేగం, మద్యం సేవించి వాహనం నడపడం వల్ల సెల్‌ఫోన్ డ్రైవింగ్ చేయడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని వివరించారు. రోడ్డు ప్రమాదాల నివారణపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించేందుకు ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చే కార్యక్రమాలను ముమ్మరం చేయాలని సూచించారు. జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల నేపథ్యంలో జిల్లాలో ఈ నెల 16వ తేదీ నుంచి ఫిబ్రవరి 15 వరకు భద్రతపై ప్రజల్లో అవగాహన కల్పించడం జరుగుతోందన్నారు. ముఖ్యంగా వాహనాలు నడిపే వారికి ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలపై ప్రత్యేక శిక్షణ చేపట్టాలని సూచించారు. ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ నియమావళి, జాతీయ రహదారులపై వాహనాలు నడిపే క్రమంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలుపై శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు. ముఖ్యంగా హెల్మెట్‌ధారణపై ప్రత్యేక ప్రచార కార్యక్రమాలను చేపట్టాలన్నారు. జిల్లా ఇన్‌ఛార్జి ఉపరవాణా శాఖాధికారి కెఎస్‌ఎంవి.కృష్ణారావు మాట్లాడుతూ ఈ ఏడాది రహదారి భద్రత ప్రచారానికి సంబంధించి 'శ్రద్ధ వహించండి' అనే నినాదంతో జాతీయ రహదారుల భద్రత మాసోత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో, పట్టణాల్లో ప్రజాప్రతినిధులు, ప్రజల భాగస్వామ్యంతో నెల రోజుల పాటు అందుకు అనుగుణంగా రూట్ మ్యాప్ సిద్ధం చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆర్‌టిసి డిఎం బి.వాణి, ఎంవిఐలు భీమారావు, జి.ప్రసాదరావు, ఎఎంవిఐలు ప్రజ్ఞ, జగదీష్, బద్దు, నరేంద్ర, నెహ్రూకుమార్, ట్రాఫిక్ ఎస్‌ఐ మధు పాల్గొన్నారు.

సత్యవోలు సచివాలయంలో జెడ్‌పి ఛైర్‌పర్సన్ తనిఖీలు

ప్రజాశక్తి - పెదపాడు

మండలంలోని సత్యవోలు గ్రామ సచివాలయాన్ని జెడ్‌పి ఛైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉదయం 10.45 గంటలకు ఆ కార్యాలయానికి వెళ్లగా సిబ్బంది ఎవరూ విధులకు రాకపోవడాన్ని ఆమె గుర్తించారు. నలుగురు ఉద్యోగులుండగా కొద్దిసేపటికి ఇద్దరు హాజరయ్యారు. మరో ఇద్దరు గైర్హాజరయ్యారు. జెడ్‌పి ఛైర్‌పర్సన్ వెంటనే ఈ విషయాన్ని డిపిఒ, ఎంపిడిఒ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన ఎంపిడిఒ సత్యవోలు సచివాలయంలోని నలుగురు ఉద్యోగులకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు.



హాజరుపట్టీ పరిశీలిస్తున్న జెడ్‌పి ఛైర్‌పర్సన్ పద్మశ్రీ

జిల్లాకు ప్రధానమంత్రి అవార్డు

ప్రజాశక్తి - ఏలూరు

అత్యంత ప్రతిష్టాత్మకమైన ప్రైమ్ మినిస్టర్స్ అవార్డ్ ఫర్ ఎక్సలెన్స్ ఇన్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్-2023 ఏలూరు జిల్లాకు లభించింది. దేశంలో వార్షిక అవార్డు పథకమైన ది పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్లో వినూత్న పనిని గుర్తించి ఎంపిక చేస్తారు. ఈ అవార్డును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లోని సంస్థలు, జిల్లాలకు అందజేస్తారు. ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించి సంపూర్ణ మూల్యాంకనం చేస్తారు. తద్వారా సివిల్ సర్వెంట్లు పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్‌లో కనబరిచిన ఉత్తమ పనితీరును పరిశీలించిన అనంతరం ఈ అవార్డు ప్రకటిస్తారు. 2023వ సంవత్సరానికి ఈ అవార్డు ఏలూరు జిల్లాకు దక్కింది. 2021 ఏప్రిల్ నుండి సంపూర్ణ మూల్యాంకనం చేసిన అనంతరం ఆయా రంగాల్లో జరిగిన అభివృద్ధిని మదింపు చేశాక జిల్లాకు ఈ అవార్డును ప్రకటించారు. ఏలూరు జిల్లా మొదటి జిల్లా కలెక్టర్‌గా రెండేళ్లు సేవలందించిన ప్రసన్న వెంకటేష్ కృషి ఫలితంగా అరుదైన అవార్డు జిల్లాకు లభించింది. దేశంలో 16 జిల్లాలను కేంద్రం ఎంపిక చేయగా అందులో ఏలూరు జిల్లాకు స్థానం లభించింది. ఈ విధంగా ఏలూరు జిల్లాకు ప్రధాన మంత్రి అవార్డు రావటానికి కారణమైన పూర్వపు కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ కృషిని పలువురు అభినందించారు.

ప్రసన్న వెంకటేష్

డాక్టర్లు, నర్సులు సమన్వయంతో పని చేయాలి

ఆసుపత్రిలో సీసీ రోడ్లు, డ్రెయినేజీ నిర్మాణం ఫిబ్రవరి 28లోగా పూర్తి చేయాలి

ఏలూరు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి నాదెండ్ల మనోహర్ ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి - ఏలూరు

రోగులకు మెరుగైన వైద్య సేవలందించడంలో డాక్టర్లు, నర్సింగ్ సిబ్బంది సమన్వయంతో టీమ్ స్పిరిట్‌తో పని చేయాలని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. గురువారం స్థానిక కలెక్టరేట్‌లో డిఆర్‌సి సమావేశానికి హాజరయ్యే ముందు మంత్రి మనోహర్ ఏలూరు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఓపికి సంబంధించిన సమాచారాన్ని అడిగి తెలుసుకుని రోజువారీ ఓపిలు ఎంత వచ్చేది, వాటికి సంబంధించిన కంప్యూటర్‌లో నమోదు చేసిన నివేదికను మంత్రి పరిశీలించారు. బ్లడ్‌బ్యాంక్‌ను పరిశీలించి బోర్డులోని వివరాలు తప్పుగా ఉండటం గమనించి సంబంధిత సెంటర్ ఇన్‌ఛార్జిని మంత్రి నిలదీశారు. ప్రతి ఒక్కరూ సమయపాలన పాటించి రోగులకు సేవలు అందించాలని తెలిపారు. డ్రెయినేజీ, సీసీ రోడ్లు, పంపులీకేజీలకు సంబంధించి ఫిబ్రవరి 28వ తేదీలోగా పనులు పూర్తి చేయాలని వైద్య విధాన పరిషత్ ఇఇని మంత్రి ఆదేశించారు. లేనిపక్షంలో చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కంటి విభాగం, ఐసియు, అభా రిజిస్టర్‌ను మంత్రి తనిఖీ చేశారు. ఐసియులో వైద్య సేవలు పొందుతున్న రోగులను పరామర్శించారు. శ్యామ్ అనే వ్యక్తి మంత్రిని కలిసి తన భార్య అంగవైకల్యంతో మంచానపడి జీవిస్తుందని, ప్రస్తుతం రూ.ఆరు వేల పెన్షన్ పొందుతున్నామని, దీనిస్థానంలో రూ.15 వేలు పింఛన్ మంజూరు చేయాలని కోరారు. దీనిపై మంత్రి స్పందిస్తూ విచారించి చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం మంత్రి విలేకరులతో మాట్లాడుతూ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో ఏలూరు జనరల్ ఆసుపత్రికి వైద్య సేవల్లో మంచి పేరుందన్నారు. ఆసుపత్రిలో డాక్టర్లు, నర్సింగ్ డిపార్ట్‌మెంట్లవారీగా ఖాళీలు ఉన్నాయన్నారు. జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి ఆధ్వర్యంలో ఎంఎల్‌ఎలతో కలిసి ఆసుపత్రి అభివృద్ధికి అవసరమైన చర్యలను తీసుకుంటామన్నారు.

డ్రెయినేజీని పరిశీలిస్తున్న మంత్రి మనోహర్

జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు భేష్

రూ.734 కోట్ల విలువైన 3.59 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ

96 శాతం రైతులకు 24 గంటల్లోనే సొమ్ము చెల్లింపులు

జిల్లా యంత్రాంగాన్ని అభినందించిన మంత్రి నాదెండ్ల మనోహర్

ప్రజాశక్తి - ఏలూరు

ఖరీఫ్ ధాన్యం కొనుగోలులో రాష్ట్రంలో మొదటిగా ఏలూరు జిల్లాలో ప్రారంభించి, అదేదిశగా కొనుగోళ్లలో జిల్లా అధికారులు చూపిన చొరవను రాష్ట్ర పౌర సరఫరాల శాఖ, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి నాదెండ్ల మనోహర్ అభినందించారు. గురువారం ఏలూరు విచ్చేసిన మంత్రి మనోహర్ ధాన్యం సేకరణపై మాట్లాడుతూ జిల్లాలో రూ.733.91 కోట్ల విలువైన 49,022 మంది రైతుల నుంచి 3,58,924 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయడం భేషుగ్గా ఉందన్నారు. సంబంధిత రైతులకు సొమ్ము కూడా చెల్లించడం అభినందనీయమన్నారు. 3.40 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యంగా నిర్దేశించినప్పటికీ దానికి మించి ధాన్యం కొనుగోలు చేయడంపై కలెక్టర్ కె.వెట్రిసెల్వి, జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డిలను మంత్రి అభినందించారు. జిల్లాలోని పౌర సరఫరాల అధికారులు, సిబ్బంది కష్టపడి పని చేశారన్నారు. జిల్లాలో సుమారు మరో 10 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాల్సిన అవసరం ఉందని అధికారులు తన దృష్టికి తీసుకొచ్చారని, తప్పకుండా ప్రతిధాన్యం గింజ కొనుగోలు చేస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి కూడా కలెక్టర్ కె.వెట్రిసెల్వి, జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డిలను అభినందించారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం

నారాయణపురంలో 2004-2005 టెన్త్ బ్యాచ్ అపూర్వ సమ్మేళనం

స్ఫూర్తిదాయకంగా నిలవాలి : ప్రధానోపాధ్యాయులు

ప్రజాశక్తి - ఉంగుటూరు

నారాయణపురం వివేకానంద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2004-2005 పదవ తరగతి పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం గురువారం అదే పాఠశాలలో నిర్వహించారు. ఆనాటి ఉపాధ్యాయులు, పాఠశాల ఉద్యోగులతో ఉల్లాసంగా గడిపారు. చిన్ననాటి మిత్రులు పరస్పరం యోగ క్షేమాలను అడిగి తెలుసుకుంటూ ఆట పాటలతో వినూత్నంగా సమ్మేళనం నిర్వహించడం అభినందనీయని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు షేక్ నాగూర్ మీరా అన్నారు. పూర్వ విద్యార్థులు ఇలా ఏడాదికి ఒకసారి సమావేశమై స్ఫూర్తిదాయకంగా నిలవాలని ఉపాధ్యాయులు ఆకాంక్షించారు.

విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో వ్యక్తి సజీవ దహనం

హీటర్ ఆన్ చేసి వదిలేయడంతో దుర్ఘటన

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

నీటిని కాచుకునే హీటర్‌ను ఆన్ చేసి వదిలేయడంతో కొద్దిసేపటికి షార్ట్ సర్క్యూట్ అయ్యి ఇల్లంతా మంటలు వ్యాపించి ఓ వ్యక్తి సజీవ దహనమైన ఘటన ఏలూరు నగరంలోని ఒకటో పట్టణ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కాకినాడ జిల్లా అన్నవరం ప్రాంతానికి చెందిన జాన గంగాధర్(30) ఇంజనీరింగ్ పూర్తి చేసి ప్రస్తుతం హైదరాబాద్ నగరంలోని ఒక కన్సల్టెన్సీలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నాడు. వర్క్ ఫ్రం హోం కావడంతో అతను ఇంటి వద్ద నుంచే పని చేస్తున్నాడు. గంగాధర్ తాతయ్య రెండేళ్ల క్రితం ఏలూరు నగరంలో తన అక్క భర్త పద్మావతి ఇంటి వద్ద మృతి చెందాడు. ఆ మరణ ధృవపత్రాన్ని తీసుకునేందుకు గంగాధర్ కనక పద్మావతి ఇంటికి బుధవారం తెల్లవారుజామున వచ్చాడు. అనంతరం గంగాధర్ కొప్పాక ప్రాంతంలో ఉంటున్న తన స్నేహితుడి ఇంటికి వెళ్లి అతనితో కలిసి మద్యం సేవించి ఇంటికి వచ్చి నిద్రకు ఉపక్రమించాడు. అతని సోదరి పద్మావతి స్థానికంగా సచివాలయంలో ఎఎన్‌ఎంగా పనిచేస్తుంది. నిద్రకు ఉపక్రమించిన తన సోదరుడు ఇంకా నిద్ర లేకపోవడంతో అతన్ని నిద్ర లేపడం ఎందుకని బయట నుంచి గెడ వేసుకుని విధులు నిమిత్తం మధ్యాహ్నం రెండు గంటల ప్రాంతంలో సచివాలయానికి బయలుదేరి వెళ్లింది. కొంతసేపటికి నిద్రలేచిన గంగాధర్ స్నానం చేసేందుకు స్నానాల గదిలో హీటర్‌ను బకెట్లో పెట్టి స్విచ్ ఆన్‌చేసి మళ్లీ నిద్రకు ఉపక్రమించాడు. కొంతసేపటికి నీరు అధికంగా వేడి అయి ఒక్కసారిగా వైర్లు షార్ట్ సర్క్యూట్‌కు గురయ్యాయి. అనంతరం క్షణాల వ్యవధిలో ఇల్లంత మంటలు వ్యాపించాయి. హఠాత్తుగా నిద్రలేచిన గంగాధర్ ఒక్కసారిగా మంటలు వ్యాపించడంతో కేకలు వేయడం ప్రారంభించాడు. ఇంటికి ఒక్కటే దారి కావడంతో ఆ దారి మొత్తం మంటలు వ్యాపించాయి. ఇంతలో అతను వంటగదిలోకి చేరుకున్నాడు. అయినప్పటికీ బయటకు వచ్చే దారి లేక మంటలు పూర్తిగా వ్యాపించి అతను సజీవ దహనమయ్యాడు. అతని అరుపులు విన్న స్థానికులు మంటలు రావడం గమనించి వారి వారి స్థాయిలో మంటలను అదుపు చేసేందుకు ఇంటిలోకి నీటిని చల్లారు. అయినప్పటికీ ప్రయోజనం లేకపోయింది. అతను ఇంటిలోనే బయటకు వచ్చే మార్గం లేక సజీవ దహనమయ్యాడు. ఇటువంటి ఇళ్లకు అనుమతులు ఇస్తున్న టౌన్ ప్లానింగ్ అధికారులపై కూడా కేసు నమోదు చేయాలని స్థానికులు కోరుతున్నారు. కేవలం ఇంటి నుంచి బయటకు వచ్చే మరో మార్గం లేక మాత్రమే గంగాధర్ సజీవ దహనం అయ్యాడని అతని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఎక్కడైనా స్థానిక ప్రజలు ఇండ్ల నమూనాలను తీసుకునే సమయంలో ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు ఒకదారి కాకుండా మరో దారి కూడా ఉండేలా ఇంటి నమూనాలను తయారు చేయించుకోవాలని పోలీసులు కోరుతున్నారు.

నల్లమాడు-లక్ష్మీపురం ఆర్‌అండ్‌బి రహదారి అధ్వానం



అధ్వానంగా ఉన్న రహదారి

ప్రజాశక్తి - ఉంగుటూరు

నల్లజర్ల - లక్ష్మీపురం ఆర్‌అండ్‌బి రహదారి అధ్వాన్నంగా ఉందని పరివాహక ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఈరోడ్డును ఎప్పుడో పదేళ్ల క్రితం మరమ్మతులు చేశారు. అప్పటి నుంచి నేటి వరకూ ఎలాంటి నిర్వహణ, గోతులు పూడ్చడం వంటి పనులు చేయలేదని ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా ఉంగుటూరు మండల శివారు గ్రామాలైన నల్లమాడు, యర్రమిల్లిపాడు ప్రజలు అటు గుణ్ణంపల్లి మీదుగా 216వ జాతీయ రహదారి గుండుగొలను - కొవ్వూరు రోడ్డుకు నిత్యం వెళ్లాల్సి ఉంటోంది. ఈక్రమంలో గోతులు, గతుకుల రోడ్డు మీద ప్రయాణాలు నరకయాతనగా ఉంటోందని వాపోతున్నారు. కూటమి ప్రభుత్వంలోనైనా రోడ్లను అభివృద్ధి చేసి కొత్తగా తారు రోడ్డు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

రూ.110 లక్షలతో తాత్కాలిక మరమ్మతులు

ఎంఎల్‌ఎ పత్సమట్ల ధర్మరాజు

నల్లజర్ల-లక్ష్మీపురం ఆర్ అండ్‌బి రహదారిలో 8.5 కి.మీ నుంచి 15.645 కి.మీ వరకూ రోడ్డులకు మరమ్మతుల నిమిత్తం రూ.కోటి 10 లక్షల నిధులను మంజూరు చేయించాను. పనులు జరుగుతున్నాయి. త్వరలో పూర్తయ్యేలా అధికారులకు ఆదేశాలు ఇచ్చాను. గత ప్రభుత్వంలో ఒక్క రూపాయి కూడా రోడ్డు నిర్వహణకు వెచ్చించలేదు.

నల్లజర్ల- లక్ష్మీపురం ఆర్‌అండ్‌బి రహదారి యర్రమిల్లిపాడు వద్ద రోడ్డు దుస్థితి

నేడు పలుచోట్ల విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి - ఏలూరు

మండలంలోని ఏలూరు డి4 సెక్షన్ పరిధిలో ఉన్న 33/11 కెవీ కొమడవోలు సబ్ స్టేషన్ పరిధిలో మరమ్మతులు చేయుటకు ఈనెల 17వ తేదీ శుక్రవారం ఉదయం 8.30 నిమిషాల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడునని ఎఇ కెవిఎం.అంబేద్కర్ అన్నారు. ఈమేరకు కొమడవోలు, ఆటోనగర్, కొమడోలు రోడ్డు, సాయినగర్, హమాలీ కాలనీ, దుర్గ గ్రాండ్ సిటీ, అందాలమ్మ తోట, రామనగర్, మారుతీనగర్, మస్తాన్ మన్యం కాలనీ, నాగేంద్ర కాలనీ, శ్రీరాంనగర్ కాలనీ, శాస్త్రీ కాలనీ, చెంచుల కాలనీ, ఇందిరమ్మ కాలనీ, పాలగూడెం, మాధవాపురం గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడునన్నారు. వినియోగదారులు గమనించి సహకరించవలసిందిగా కోరారు.

పెదవేగి : పెదవేగి మండలం విజయరాయి సెక్షన్లో ఈనెల 17వ తేదీ శుక్రవారం 33/11 కెవీ రాయచుపాలెం సబ్స్టేషన్ పరిధిలో చెట్టుకొమ్మలు కత్తిరింపు పనులు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 4 గంటల వరకూ నిర్వహించబడునని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కెవిఎం.అంబేద్కర్ తెలిపారు. రాయచుపాలెం సబ్ స్టేషన్ పరిధిలోని రాయచుపాలెం, కొండలరావుపాలెం, రత్నాలకుంట, బల్లగూడెం గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయబడునని, వినియోగదారులు గమనించి, సహకరించవలసిందిగా కోరారు.

పెదవేగి సెక్షన్ పరిధిలో గల 33/11 కెవీ పెదవేగి సబ్ స్టేషన్, 33/11 కెవీ కవ్వగుంట సబ్ స్టేషన్లలో చెట్టుకొమ్మలు కత్తిరింపు కారణంగా శుక్రవారం ఉదయం 8:30 నిమిషాల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడునని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కెవిఎం.అంబేద్కర్ తెలిపారు. ఆయా పరిధిలో గల గ్రామాలు పెదవేగి, గార్లమడుగు, సూర్యారావుపేట, లక్ష్మీపురం, ఎంఆర్సి కాలనీ, న్యాయంపల్లి, కవ్వగుంట, ముఠాలకుంపల్లి గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడునన్నారు. విద్యుత్ వినియోగదారులు, వ్యవసాయ రైతులు సహకరించవలసిందిగా కోరారు.

లింగపాలెం : 33/11 కెవీ ధర్మాజీగూడెం సబ్ స్టేషన్ పరిధిలోని సబ్ స్టేషన్ నుంచి 11 కెవీ ఇండస్ట్రియల్, ధర్మాజీగూడెం హెడ్ క్వార్టర్ ఫీడర్ చెట్టుకొమ్మలు నరుకుట, కరెంట్ మరమ్మతుల పని చేయుటకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కరెంట్ నిలుపుదల జరుగును. కతమార్లపల్లి, ధర్మాజీగూడెం, ఇండస్ట్రియల్ సర్వీసెస్ మాత్రమే కరెంటు నిలుపివేయబడుతుంది. గ్రామ ప్రజలు అందరు ఈ కరెంటు కోతను అనుసరించి, డిపార్ట్మెంటు వారికి సహకరించాలని కోరారు.

మండలంలోని రంగాపురం సెక్షన్ పరిధిలో శుక్రవారం విద్యుత్ ఉపకేంద్రంలో మరమ్మతుల నిమిత్తం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ నిలిపివేయడం జరుగుతుందని ఎఇ తెలిపారు. రంగాపురం సెక్షన్ పరిధిలోని రంగాపురం, ములగలంపాడు, కొత్తపల్లి, ముడిచెర్ల, కె.గోకవరం, గణపవారిగూడెం, అన్నవరేని వారి గూడెం, పుప్పాల వారిగూడెం గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయబడునన్నారు. వినియోగదారులు గమనించి సహకరించవలసిందిగా కోరారు.

మాజీ సర్పంచి కుటుంబ సభ్యులకు పరామర్శ

ప్రజాశక్తి - చింతలపూడి

ఇటీవల మృతిచెందిన టిడిపి సీనియర్ నాయకుడు, మండలంలోని యర్రంపల్లి మాజీ సర్పంచి, కీర్తిశేషులు పోకనాటి నాగేశ్వరరావు కుటుంబ సభ్యులను ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ గురువారం పరామర్శించారు. యర్రంపల్లిలోని ఆయన ఇంటికి వెళ్లి నాగేశ్వరరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మృతుని కుటుంబ సభ్యులను ఓదార్చి, ప్రగాఢ సంతాపం తెలిపారు. టిడిపి తరఫున అండగా ఉంటామని నాగేశ్వరరావు కుటుంబ సభ్యులకు ఎంపీ మహేష్ కుమార్ భరోసా ఇచ్చారు. సర్పంచి, ఎంపిటిసి సభ్యుడిగా నాగేశ్వరరావు గ్రామాభివృద్ధికి ఎనలేని కృషిచేశారని ఎంపీ కొనియాడారు. నాగేశ్వరరావు మృతి టిడిపికి తీరని లోటని ఎంపీ మహేష్ కుమార్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణ పనులు నిలిపివేత

ప్రమాదాల బారిన వాహనదారులు

అధికారులు చర్యలు తీసుకోవాలని వేడుకోలు

ప్రజాశక్తి - కుక్కునూరు

మండలంలోని మెయిన్ రోడ్డు నిర్మాణం అర్ధాంతరంగా ఆగిపోవడంతో పలు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఇటీవల రాజీవ్ నగర్లో ఓ కారు, అమరవరంలో ఓ ట్రాక్టర్, అల్లిగూడెంలో కారు, బంజరగూడెం వద్ద బుధవారం నాడు ఎదురెదురుగా వస్తున్న రెండు టూ వీలర్స్ ఢీకొన్న ఘటనలు చోటుచేసుకున్నాయి. దాదాపు 40 కిలోమీటర్లు తవ్వి వదిలేసిన రోడ్డుపై లేస్తున్న దుమ్ము వల్ల పలు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నా అధికారులు ఎవరూ పట్టించుకోవటం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నేరాలు - ఘోరాలు

మహిళపై ముగ్గురు దాడి

గొల్లపల్లిలో దారుణం

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

ఇంటి వాకిలి ముందు చల్లిన నీళ్లు రోడ్డుపై పడడంతో సొంతమరిది వీర్రాజు, అతని భార్య రాధిక, చిన్న కుమారుడు ప్రవీణ్ కలిసి ఇంటిలో ఒంటరిగా ఉన్న మహిళపై అన్యాయంగా దాడిచేసి తీవ్రంగా గాయపరిచిన ఘటన నూజివీడు మండలం గొల్లపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. బాధితురాలి కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. గొల్లపల్లి గ్రామానికి చెందిన మరీదు రమేష్, లీలావతి వ్యవసాయ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. ఈనెల 13వ తేదీ సాయంత్రం సంక్రాంతి పండుగ సందర్భంగా ఇంటిముందు ముగ్గు వేసేందుకు వాకిలి మొత్తం నీళ్లు చల్లింది. ఆ నీళ్లు ఎదురుగా ఉన్న రోడ్డుపై పడ్డాయి. దీంతో లీలావతి ఇంటిపక్కనే ఉంటున్న మరిది మరీదు వీర్రాజు, కుటుంబసభ్యులు లీలావతితో ఘర్షణకు దిగారు. పరస్పరం దూషించుకున్నారు. లీలావతి భర్త రమేష్పై దాడిచేసి చొక్కా చింపి కిందకు నెట్టేశారు. అక్కడితో ఆగకుండా ఇంటిపై రాళ్లు విసిరి దాడికి ప్రయత్నించారు. ఆ వివాదం సద్దుమణిగిందనుకున్న తరుణంలో మరుసటిరోజు 14వ తేదీ ఉదయం ఇంటిలో ఒంటరిగా ఉన్న లీలావతిపై మళ్లీదాడికి పాల్పడ్డారు. ఆమెను కిందపడేసి తీవ్రంగా కొట్టారు. ఈ ఘటనలో లీలావతి చేయి విరిగి, భుజం, మెడపై తీవ్రగాయాలయ్యాయి. దాడి ఘటనను ఫోన్లో వీడియో రికార్డు చేస్తున్న ఆ మహిళ ఫోన్ కూడా లాక్కొని నోటికొచ్చినట్లు దుర్భాషలాడారు. ఈ క్రమంలో ఆమె మెడలోని బంగారు పుస్తెలు తెగిపోయి మెడకు తీవ్రగాయమైంది. ఈ విషయాన్ని బయటకు వెళ్లిన భర్తకు చుట్టుపక్కలవారు సమాచారం ఇవ్వడంతో ఆయన హుటాహుటిన ఇంటికి చేరుకుని భార్యను చికిత్స నిమిత్తం నూజివీడు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనారోగ్యంతో బాధపడుతున్న తనను కనికరం లేకుండా ముగ్గురు కలిసి దాడిచేసి, తీవ్రంగా కొట్టారు. తనకు న్యాయం చేయాలని లీలావతి ఆవేదన వ్యక్తం చేస్తోంది. నూజివీడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నారు.

నాటుసారా విక్రేతలు అరెస్ట్

ప్రజాశక్తి - ముసునూరు

నాటుసారా రహిత ఆంధ్రప్రదేశ్ కోసం ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన నవోదయం 2.0 అనే కార్యక్రమంలో భాగంగా మండలంలోని చెక్కపల్లి గ్రామంలో దాడులు నిర్వహించినట్లు ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ ఎ.మస్తానయ్య తెలిపారు. ఈ దాడుల్లో తాళం సంపత రావును అదుపులోకి తీసుకొని అతని వద్ద 5 లీటర్ల నాటు సారాయిని స్వాధీన పరచుకొన్నట్లు తెలిపారు. అలాగే మండల కేంద్రమైన ముసునూరు గ్రామంలో జరిపిన దాడులలో చెంగల నాగేంద్ర రావును అదుపులోకి తీసుకొని అతని వద్ద 10 లీటర్ల నాటు సారాయిని స్వాధీన పరచుకొని ఇద్దరిపై కేసులు నమోదు చేసినట్లు ఎ.మస్తానయ్య తెలిపారు. ఈ దాడులలో ఏలూరు ఎన్ఫోర్స్మెంట్ ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ పిఎస్డి.భోగేశ్వర రావు, ఏలూరు సబ్ ఇన్స్పెక్టర్ కెఎండి.ఆరిఫ్, నూజివీడు ప్రొహిబిషన్, ఎక్సైజ్ సబ్ ఇన్స్పెక్టర్ వై.ఈశ్వర రావు, ఎం.ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

బంగారు నగలు చోరీ

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడు పట్టణంలోని న్యూ ఎంప్లాయిస్ కాలనీలో నివసిస్తున్న పాముల వెంకటరత్నం ఇంటిలో గుర్తుతెలియని అగంతకులు బంగారం చోరీ చేశారు. సంక్రాంతి సెలవులు కావడంతో గన్నవరంలోని బంధువుల ఇంటికి వెంకటరత్నం కుటుంబ సభ్యులు వెళ్లారు. తిరిగి వచ్చి గురువారం పరిశీలించగా బీరువా బద్దలు కొట్టి కాసున్నర బంగారు నగలు చోరీ చేసినట్లు గుర్తించారు. బాధితుడు వెంకటరత్నం పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుని ఫిర్యాదు మేరకు పోలీసులు సంఘటనా స్థలికి చేరుకొని దర్యాప్తు చేపట్టారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

ట్రాఫిక్ సమస్య పరిష్కరించరూ!

అడుగడుగునా ప్రజల అవస్థలు

పెరుగుతున్న వాహనాలకు తగ్గట్టు.. రహదారులు పెంచాలని వేడుకోలు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

చారిత్రాత్మక పట్టణమైన రెవెన్యూ డివిజన్ కేంద్రం నూజివీడు రాను రాను ట్రాఫిక్ వలయంలో ఇరుక్కుపోతుంది. భారతదేశానికి స్వాతంత్రం వచ్చిన తొలినాళ్లలో ఉన్న రహదారులే నేటికీ కొనసాగుతున్నాయి అనడంలో ఏమాత్రం అతిశయోక్తి లేదు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ అనంతరం అనేక పార్టీలు, అనేకమంది ప్రజాప్రతినిధుల పాలన కొనసాగించినప్పటికీ నూజివీడు పట్టణంలోని రహదారుల రూపురేఖలు ఏమాత్రం మారలేదు. చంద్రబాబు పరిపాలనలోని రాష్ట్ర విభజనకు పూర్వం ఆంధ్రప్రదేశ్లో రాష్ట్రవ్యాప్తంగా రోడ్ల విస్తరణ కొనసాగింది. ఆ సమయంలో కూడా నూజివీడు పట్టణంలో రోడ్ల విస్తరణ ఊసే లేదు. నాడు వ్యాపార సంస్థలకు చెందిన భవనాలు ఎక్కడ కూలిపోతాయోనని రాష్ట్ర మాజీ మంత్రి పాలడుగు వెంకట్రావు నేతృత్వంలో పట్టణంలోని పెద్ద గాంధీ బొమ్మ సెంటర్ వద్ద రోడ్ల విస్తరణకు వ్యతిరేకంగా నిరసన దీక్షలు చేపట్టారు. ఈ దీక్షలకు వర్తక, వాణిజ్య, వ్యాపార సంస్థలు మద్దతు పలికాయి. నాటి పరిస్థితులకు అప్పటి ఆందోళన సహేతుకమే అయినప్పటికీ, నేడు పెరుగుతున్న ప్రజల అవసరాల దృష్ట్యా రోడ్ల విస్తరణ కొనసాగాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఉపాధి, ఉద్యోగ, విద్య అవసరాల కోసం సుదూర ప్రాంతాల నుంచి నూజివీడు పట్టణ పరిసర ప్రాంతాలలో ఎంతో మంది జీవిస్తున్నారు. ఇంచుమించుగా పట్టణ పరిసర ప్రాంతాలలో లక్ష మంది ప్రజానీకం జీవించడం, రాకపోకలు కొనసాగించడం జరుగుతుంది. వ్యక్తిగత అవసరాలకు వినియోగించే ద్విచక్ర వాహనాలు, కార్లతో పాటు రవాణా సౌకర్యంగా కొనసాగే ప్రయివేటు వాహనాలైన టాటా మ్యాజిక్, కార్లు, మినీ బస్సులు, విద్యాసంస్థలకు చెందిన బస్సులు వంటి వాహనాలు విపరీతంగా పెరిగాయి. రోజురోజుకి వాహనాల వినియోగం సంఖ్య పెరుగుతున్నప్పటికీ వాటి సామర్థ్యానికి, సౌకర్యానికి తగిన రీతిలో రోడ్ల విస్తరణ జరగకపోవడం దారుణమైన అంశమని పలువురు సామాజికవేత్తలు వ్యాఖ్యానిస్తున్నారు. రోడ్ల విస్తరణ జరగని కారణంగా నూజివీడు పట్టణ పరిసర ప్రాంతాలు నిత్యం ట్రాఫిక్ వలయంలో ఇరుక్కుపోయి సతమతమవుతున్నాయి. రెవెన్యూ డివిజన్ కేంద్రం కావడం వల్ల నూజివీడు పట్టణానికి వివిధ ప్రాంతాల నుంచి అధికారులు, సమస్యల పరిష్కారం కోసం అనేక వర్గాలకు చెందిన ప్రజలు నిత్యం వందలాదిగా రాకపోకలు కొనసాగిస్తారు. వీరందరి అవసరాలు, సౌకర్యాలను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు, అధికారులు సకాలంలో స్పందించి రోడ్ల విస్తరణకు మార్గం సుగమం చేయాలని నూజివీడు పట్టణ ప్రజలు ముక్తకంఠంతో డిమాండ్ చేస్తున్నారు. లేకుంటే రాను రాను నూజివీడు పట్టణంలోని రహదారులపై నడక కూడా నరకప్రాయంగానే మారనుందని పట్టణ ప్రాంత ప్రజానీకం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ట్రాఫిక్ నిలిచిపోవడంతో రద్దీగా మారిన నూజివీడు సెంటర్

అస్తవ్యస్తంగా డ్రెయినేజీ వ్యవస్థ

దోమలతో నిండివున్న మురికిగుంటలు

ప్రజాశక్తి - చాట్రాయి

మండల కేంద్రమైన చాట్రాయి గ్రామంలో డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది. సరైన డ్రెయినేజీ వ్యవస్థ లేక ఇళ్లల్లో వాడుకున్న మురికి నీరు అంతా రోడ్డు మీదకు చేరి గుంటల్లో నిల్వ ఉండటం వల్ల వాటిల్లో దోమలు చేరి ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. దీనిపై ఎన్నిసార్లు పంచాయతీ కార్యదర్శి, ప్రభుత్వ అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ప్రయోజనం లేకుండా పోతుందని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి మేడేపల్లి హెూలీ మేరీ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గురువారం ప్రజాశక్తితో ఆమె మాట్లాడుతూ ప్రజల జీవన విధానంలో అతి ముఖ్యమైనది ఆరోగ్యమని, ఆరోగ్యాన్ని కాపాడుకునే ప్రయత్నం ప్రజలు చేస్తున్నా అధికారుల నిర్లక్ష్యం వల్ల అంటువ్యాధుల బారిన పడుతున్నారని అన్నారు. చాట్రాయిలోని శివాలయం దేవాలయపు వీధిలో మురికి నీరు కాలువలలో చేరి పెద్ద పెద్ద మురికి గుంటలుగా ఏర్పడి, ఆగోతులలో దోమలు పెరగటం వల్ల చికెన్ గున్యా, డెంగీ, మలేరియా వంటి వ్యాధుల బారిన పడుతున్నారు. దీంతో ప్రజలు వైద్య ఖర్చులకు వేలాది రూపాయలు ఖర్చు పెట్టాల్సి వస్తుందని, రెక్కాడితే డొక్కాడని ప్రజలు ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నా అధికారులు మాత్రం సమస్య పరిష్కారానికి ప్రయత్నం కూడా చేయటం లేదని మండిపడ్డారు. పెరిగిన నిత్యావసర సరుకుల ధరలు ఒకపక్క, పెరిగిన కరెంటు ఛార్జీలు మరోపక్క రైతు కూలీలు కట్టలేక ఆర్థిక ఇబ్బందులతో అల్లాడుతుంటే, ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి ప్రజలు అప్పుల పాలు అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వాధికారులు పట్టించుకొని సమస్య పరిష్కారానికి కృషి చేయాలని అన్నారు.

వ్యాధుల బారిన స్థానికులు

పట్టించుకోని అధికారులు

మాట్లాడుతున్న తహశీల్దార్ శర్మ

రీ సర్వే కొనసాగించాలి

తహశీల్దార్ పురుషోత్తమ శర్మ

ప్రజాశక్తి - ముసునూరు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రీ సర్వే ఎటువంటి ఇబ్బందులు లేకుండా కొనసాగించాలని మండల రెవెన్యూ తహశీల్దార్ జి.పురుషోత్తమ శర్మ అన్నారు. గురువారం మండల కేంద్రమైన ముసునూరు రెవెన్యూ కార్యాలయంలో విఆర్ఒలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ పురుషోత్తమ శర్మ మాట్లాడుతూ గత ప్రభుత్వం చేపట్టిన రీ సర్వే మరలా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేపట్టారన్నారు. మిగిలిపోయిన గ్రామాల్లో రీ సర్వే కొనసాగించే విధంగా ఆదేశాలు వచ్చాయని, గ్రామాల్లో ఎటువంటి ఇబ్బందులు లేకుండా రైతులకు అనుకూలంగా రీ సర్వే నిర్వహించాలన్నారు. గతంతో పోల్చుకుంటే ఈసారి ఒక్కొక్క గ్రామంలో 60 రోజులకుపైగా ఈ సర్వే నిర్వహించే విధంగా చర్యలు చేపడుతున్నట్లు ఆయన తెలియజేశారు.

18న షాప్ల నిర్వహణకు వేలంపాట

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

ఈనెల 18వ తేదీ ఉదయం 10 గంటలకు పూజా ద్రవ్యములు, తదితర షాప్ల నిర్వహణకు బహిరంగ వేలంపాట నిర్వహించబడుతుందని దేవస్థాన కార్యనిర్వాహక కార్యదర్శి సిహెచ్.సాయి తెలిపారు. మండల పరిధిలోని తోటపల్లి గ్రామంలో వేంచేసియున్న దుగ్గిరాల బాల రావమ్మ తల్లి మాఘమాస పౌర్ణమి తిరునాళ్ల సందర్భంగా వేలంపాట నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి కలవారు ధరావత్తు చెల్లించి పాల్గొనాలని తెలియజేశారు.

అగ్నిప్రమాద బాధిత కుటుంబానికి సాయం

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలోని కొరగుంటపాలెం గ్రామంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగి ఇల్లు దగ్ధమైంది. గ్రామానికి చెందిన ముచ్చు వెంకయ్య తాటాకు ఇంటికి భోగి రోజు ఉదయం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగి ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. ఈ ప్రమాదంలో ఇంటిలో వస్తువులన్నీ కాలి బూడిదయ్యాయి. ఈ విషయం తెలుసుకున్న అమరావతి బ్రాండ్ అంబాసిడర్ అంబుల వైష్ణవి తన తండ్రి డాక్టర్ మనోజ్కు తెలిపింది. దీంతో మనోజ్ గురువారం ఆ గ్రామం వెళ్లి ముచ్చు వెంకయ్య కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం రూ.5 వేలు నగదు, దుస్తులు అగ్ని బాధితులకు అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి పేరే రామకృష్ణ పాల్గొన్నారు.

అగ్ని బాధితులకు నగదు అందజేస్తున్న డాక్టర్ మనోజ్

రైతుల సమస్యలు పరిష్కరించాలని నేడు ధర్నా

విజయవంతం చేయాలి : రైతు సంఘం మండల కార్యదర్శి శ్రీనివాస్

ప్రజాశక్తి - ముసునూరు

రైతుల సమస్యల పరిష్కారం కోసం విజయవాడలోని ధర్నా చౌక్ సెంటర్ వద్ద ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యాన ఈనెల 17న చేపట్టే ధర్నాను విజయవంతం చేయాలని రైతుసంఘం మండల కార్యదర్శి సిహెచ్.శ్రీనివాస్ అన్నారు. గురువారం మండల కేంద్రమైన ముసునూరు గ్రామంలో రైతులు, సిపిఎం నాయకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎన్నికల్లో ఇచ్చిన హామీ అన్నదాత సుఖీభవ పథకం ఇప్పటి వరకు ఇవ్వలేదన్నారు. ఉచిత పంటల బీమా పథకం కొనసాగించాలని, వ్యవసాయ మోటార్లకు మీటర్లు పెట్టరాదని, చింతలపూడి ఎత్తిపోతల పథకం పనులు పూర్తి చేయాలని, సాగునీటి ప్రాజెక్టుల నిర్వహణకు నిధులు విడుదల చేయాలని, పాడి రైతులకు లీటర్కు రూ.ఐదు చొప్పున బోనస్ ఇవ్వాలన్నారు. కౌలు రైతులకు గుర్తింపు కార్డుతో పని లేకుండా వడ్డీ లేని పంట రుణాలు ఇవ్వాలని, రీ సర్వేలో రైతులకు కొన్ని సెంట్లు గత ప్రభుత్వం తగ్గించింది, ఈ ప్రభుత్వం మరలా రికార్డు ప్రకారం ఆ రైతుకు ఆన్లైన్లో నమోదు చేసే విధంగా ప్రభుత్వ రెవెన్యూ అధికారులతో సమీక్షించాలని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు జి.రాజు, కోడవలి శ్రీనివాసరావు, కంచర్ల రమేష్, కంచర్ల శివప్రసాద్, దుర్గారావు, సత్యనారాయణ, చెన్నారావు రాంబాబు పాల్గొన్నారు.

యానిమేటర్ల వేతన బకాయిలు విడుదల చేయాలి

కుక్కునూరు : వెలుగు యానిమేటర్లకు బకాయి వేతనాలు విడుదల చేయాలని సిఐటియు మండల కార్యదర్శి యర్నం సాయికిరణ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం స్థానిక సుందరయ్య భవనం ప్రజా సంఘాల కార్యాలయంలో జరిగిన ముఖ్యుల సమావేశంలో సాయికిరణ్ మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు అందించడానికి, గ్రామీణ పేదరికం నిర్మూలన కోసం అహర్నిశలు కృషి చేస్తున్న యానిమేటర్లు చాలీచాలని జీతాలతో తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కుంటుంటే, ప్రభుత్వం మాత్రం వారి సమస్యలను పట్టించుకోకుండా, 6 నెలల నుంచి వేతనాలు ఇవ్వకుండా నిర్లక్ష్యం చేస్తుందని విమర్శించారు. యానిమేటర్లకు కావాల్సింది సంక్రాంతి శుభాకాంక్షలు కాదని, సంక్రాంతి జరుపుకోవడం కోసం అవసరమైన వారి వేతనాలని అన్నారు. ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా యానిమేటర్లపై అధికారులు పని భారం పెంచుతూ తీవ్రమైన ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు.ఇప్పటికైనా స్పందించి యానిమేటర్ల ఆరు నెలల బకాయి వేతనాలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

అంతర్జాతీయ స్కేటర్ జెస్సిరాజ్కు పురస్కారం

రాష్ట్రపతి భవనంలో పురస్కారం అందజేసిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఏకైక విజేతగా జోగన్నపాలెం విద్యార్థిని

ప్రజాశక్తి - దెందులూరు

కృషి, పట్టుదల, నిరంతర సాధనతో అంతర్జాతీయ స్కేటర్గా భారత ప్రభుత్వ పురస్కారాన్ని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా అందుకుంది మండలంలోని జోగన్నపాలెం గ్రామానికి చెందిన మాత్రపు సురేష్రాజు, రాధా దంపతుల కుమార్తె మాత్రపు జెస్సిరాజ్. ఆ విద్యార్థిని జోగన్నపాలెం, తల్లిదండ్రుల కీర్తిప్రతిష్టతను దేశవ్యాప్తంగా ఇనుమడింప చేసింది. విజయవాడ ఎన్ఎంఎస్ పాఠశాలలో జెస్సిరాజ్ తొమ్మిదవ తరగతి చదువుతుంది. 9వ ఏట నుంచి స్కేటింగ్లో ఆసక్తి కలగడం, శిక్షణ వైపు మొగ్గు చూపడంతో గమనించిన తల్లిదండ్రులు ప్రోత్సహించి, కోచ్ సింహాద్రి వద్ద శిక్షణ ఇప్పించారు. రాష్ట్ర, జాతీయ స్థాయిలో స్కేటింగ్లో 50 పథకాలను జెస్సిరాజ్ సాధించింది. గత సంవత్సరం ఆసియా కప్ ప్రపంచ కప్ పోటీల్లో విజయం సాధించి భారతదేశ క్రీడా ఖ్యాతిని ఖండాంతర వ్యాప్తి చేసింది. న్యూజిలాండ్లో జరిగిన ప్రపంచ ఓషియాన పసిఫిక్ కప్ ఛాంపియన్షిప్ 2024లో తనకంటే పెద్దవాళ్లతో తలపడి ప్రపంచ క్రీడాకారులను వెనక్కి నెట్టి, భారతదేశానికి బంగారు పతకాన్ని సాధించింది.

రాష్ట్రపతి చేతుల మీదుగా పురస్కారం అందుకుంటున్న జెస్సిరాజ్

జెస్సిరాజ్ ప్రతిభను, అంతర్జాతీయ విజయాన్ని గుర్తించి, గౌరవించి రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రపతి కార్యాలయంలో ఇటీవల రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అవార్డును, ధృవీకరణ పత్రాన్ని అందజేశారు.

ప్రధాని మోడీ అభినందన

భారత ప్రధాని నరేంద్ర మోడీ స్కేటింగ్లో జెస్సిరాజ్ సాధించిన అవార్డు ప్రతిభను అభినందించారు. మరిన్ని విజయాలు సాధించాలని సూచించారు.

తల్లి ప్రోత్సాహం కోచ్ శిక్షణతోనే..

తనలోని స్కేటింగ్ పట్ల ఆసక్తిని తన తల్లి రాధ, తండ్రి సురేష్ గమనించి, ప్రోత్సహించి శిక్షణ ఇప్పించారని జెస్సిరాజ్ అన్నారు. తన తల్లి రాధ అథ్లెట్స్లో నేషనల్ విన్నర్ కావడం, తనలోని క్రీడా ఆసక్తిని గమనించి ప్రోత్సహించటం, తన తాత ఉపాధ్యాయుడు రాజారావు, సూర్యకాంతమ్మ నిరంతర పర్యవేక్షణ, ప్రోత్సాహంతో తాను భారతదేశానికి స్కేటింగ్లో బంగారు పథకాన్ని అందించటానికి దోహద పడిందన్నారు. తన కోచ్ సింహాద్రి అత్యున్నత శిక్షణ, ప్రోత్సాహం తాను ఎన్నటికీ మరువలేనని సంతోషం వ్యక్తం చేసింది.

ప్రముఖుల అభినందన

జెస్సిరాజ్కు భారత ప్రభుత్వం వరల్డ్ స్టేట్ ఓషియాన పసిఫిక్ కప్ ఛాంపియన్షిప్ విభాగంలో అవార్డు ఇవ్వడం పట్ల దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్, ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ యాదవ్, జోగన్నపాలెం గ్రామ సర్పంచి పసుమర్తి రాజేశ్వరి, మాజీ సర్పంచి పసుమర్తి ప్రభాకర్ రావు, సొసైటీ ప్రెసిడెంట్ డాక్టర్ పసుమర్తి మధు అభినందించారు.

ప్రధాని మోడీతో పురస్కార గ్రహీతలు

బహుమతులు అందజేస్తున్న ఎంఎల్ఎ

ముగ్గుల పోటీల విజేతలకు ఎంఎల్ఎ బహుమతులు అందజేత

ప్రజాశక్తి - చింతలపూడి

ముగ్గుల పోటీలో గెలుపొందిన వారింటికి చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్ కుమార్ దంపతులు స్వయంగా ఇంటికి వెళ్లి బహుమతులు అందజేశారు. ఉల్లాసంగా, ఉత్సాహంగా నియోజవర్గంలోని నాలుగు మండలాల్లో, పట్టణాల్లో సంక్రాంతి పండుగ సంతోషంగా జరుపుకోవాలనే ఉద్దేశంతో మహిళలకు ముగ్గుల పోటీలు వారి ఇంటి దగ్గర నిర్వహించి గెలుపొందిన వారికి స్వయంగా ఇంటికి వెళ్లి బహుమతులను అందజేశారు. ముగ్గుల పోటీల్లో గెలుపొందిన వారికి గురువారం కుటుంబ సమేతంగా వారి ఇంటికి వెళ్లి బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా వారు ఆనందాన్ని వ్యక్తం చేశారు.

గ్రామదేవత కడమ్మకు ఎపి ట్రైకార్ ఛైర్మన్ బొరగం సారె అందజేత

ప్రజాశక్తి - పోలవరం

ఎపి ట్రైకర్ ఛైర్మన్ బొరగం శ్రీనివాసులు ఆధ్వర్యంలో పోలవరం పంచాయతీ మాజీ ఉప సర్పంచి మంగినకొండ కుటుంబం గురువారం పోలవరం గ్రామ దేవత కడెమ్మకు చీర, సారె, పసుపు, కుంకుమలతో గ్రామంలోకి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మాతృశ్రీ కడమ్మ అమ్మవారిని గ్రామంలో పల్లకిలో ఊరేగింపు సేవలు నిర్వహించారు. బాణాసంచా, తీన్మార్ వాయిద్యాలు, మేళతాళాలతో కడమ్మ ఆలయ నిర్వాహక బృందంతో గోదావరి రజక కమిటీ ఊరేగింపు సేవలను నిర్వహించింది. ఈ సందర్భంగా ట్రైకార్ ఛైర్మన్ బొరగం శ్రీనివాసులు రజక కమిటీకి మేకపోతుని అందజేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ పాలకవర్గ సభ్యులు మంగిన పోసి రత్నం, మేడూరి పార్వతి పాల్గొన్నారు.

మృతదేహాన్ని ఖననం చేయకుండా పాస్టర్ అడ్డగింత

శ్మశాన వాటిక భూమి తనదేనంటూ హల్చల్

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

ప్రభుత్వానికి చెందిన శ్మశాన వాటిక భూమి తనదేనంటూ ఒక చర్చి పాస్టరు, ఆచర్చి పెద్దలు కలిసి మృత దేహాన్ని ఆ శ్మశాన వాటికలో ఖననం చేయకుండా అడ్డుకోవడంతో వారిపై ఏలూరు టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. వట్లూరుకు చెందిన కర్నే కె.రంగారావు(63) అనారోగ్యంతో మరణించాడు. అతని కుటుంబ సభ్యులు మృతదేహాన్ని వట్లూరులో ఉన్న క్రైస్తవ శ్మశానవాటికకు తీసుకువెళ్తుండగా వట్లూరుకు చెందిన ఆర్సిఎం చర్చి ఫాదర్ ఆసిస్, ఆ చర్చి పెద్దలు 12 మంది, ఇతరులు కలిసి శ్మశానవాటికకు మృతదేహాన్ని రానీయకుండా అడ్డుకున్నారు. దీంతో మృతుని బంధువులు విఆర్ఒకు ఫిర్యాదు చేయడంతో విఆర్ఒ-1 కె.దుర్గారావు వచ్చి పరిశీలించారు. ఆ స్థలం ప్రభుత్వ పోరంబోకు స్థలం అని, ఎవరైనా ఆ శ్మశానవాటికలో ఖననం చేసుకోవచ్చని చెప్పినా ఆ ఫాదర్తోపాటు వారందరూ కలిసి విఆర్ఒ విధులకు ఆటంకం కలిగించారు. దీంతో పెదపాడు తహశీల్దార్, త్రి టౌన్ సిఐ ఆధ్వర్యంలో పోలీసులు వచ్చి చివరకు ఆ మృతదేహాన్ని ఖననం చేయించారు. ఈ సంఘటనపై విఆర్ఒ దుర్గారావు త్రి టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఆర్సిఎం చర్చి ఫాదర్ ఆసిస్తో పాటు ఇతరులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ప్రకటన

మహారాజశ్రీ తణుకు నాలుగవ అదనపు జిల్లా జడ్జ్ వారి కోర్టులో
D.O.P.No.161/2024

Between:
పిటిషనర్: బర్రె ప్రదీప్
మరియు
రెస్పాండెంట్స్ : బర్రె హరి కళ్యాణి వగైరా
2వ రెస్పాండెంట్:
పాము అఖిల్, S/o వీర వెంకట సత్యనారాయణ మూర్తి, వేల్పూరు, తణుకు రూరల్ మండలం, పశ్చిమ గోదావరి జిల్లా, ఆంధ్రప్రదేశ్-534222

పై నెంబర్ పిటిషన్ నందు శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారము మీకు ఎన్నిసార్లు నోటీస్లు పంపించిననూ అమలు జరగని కారణముగా Substitute of Service ద్వారా నోటీస్లు అమలు నిమిత్తము ది.27.01.2025 సం.రం.తేదీనకు వాయిదా వేసినారు. ఆరోజు ఉదయం గం.10-30 ని.లకు పై కోర్టు వారి ఎదుట హాజరై మీ ఆక్షేపణలు తెలియపర్చుకోవలెను. లేనిఎడల మీ పరోక్షమందు తీర్మానించబడునని తెలియ.జేయడమైనది.

//By order//
కొందూరి అనంతపద్మనాభం
ఇందుకూరి వెంకట నరసింహారాజు
పిటిషనర్ తరపు న్యాయవాదులు
ది.11.01.2025 తణుకు, సెల్: 99481 93227

ప్రకటన

ఏలూరు జిల్లా, ఏలూరు పోస్టల్ కాలనీ విజయ గార్డెన్, 1వ రోడ్డు, డోర్ నెం. 27-21-21-6ఎ, కాపురస్తులు చోడే దక్షిణామూర్తి గారి కుమారుడు చోడే రాజు నాకు ఇచ్చిన సంజాయిషీ ప్రకారం యావన్మంది ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా

నా క్లయింటు ఏలూరు జిల్లా, భీమడోలు అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ ఆఫీస్ నందు ఆఫీస్ సబార్డినేట్గా పనిచేయుచున్నారు. ది. 28-12-2024వ తేదిన సాయంత్రం 5.30 గంటలకు భీమడోలు నుండి ఏలూరుకు ఆర్.టి.సి. బస్లో వచ్చుచుండగా మా క్లయింటు ఆఫీస్ తాలుకు 1. Witness case file for year 2024. 2. Coramandal International Bill books. 3. Stock register. 4. Analasis report`s. 5. Mediator report`s 6. Courierbills and along with and other documents
ఏలూరు బస్ స్టాండ్లో దిగిన వెంటనే చూచుకొనగా కనిపించకుండా పోయినవి. సదరు దస్త్రములు గురించి ఎంత వెతికిన దొరకలేదు.

కావున సదరు దస్త్రములు ఎవరికైనా దొరికిన యెడల నాకు గాని, నా క్లయింట్ అడ్రస్కు గాని అప్పగించవలసిందిగా కోరుచున్నాము. మరియు సదరు దస్త్రములు ఉపయోగించి ఎవరైన అన్యాకాంత్రము చేసిన ఎడల వారిపై నా క్లయింట్ తీసుకొను అన్ని సివిల్ & క్రిమినల్ చర్యలకు బాధ్యులగుదురు అని తెలియపర్చుడమైనది.

సి.వి. శ్రీనివాస శాస్త్రి
సి.వి. సూర్య కృష్ణ
అడ్వకేట్స్
తంగెళ్లమూడి, ఖండ్రికగూడెం,
ఏలూరు,
సెల్: 9848273389